కథ

# నిన్నటిదాకా శిలనైనా...

కొత్తపల్లి ఉదయబాబు

రైల్వేగేటు పడడంతో బస్సు ఆగిపోయింది.

బయట్నుంచే బయటకు చూశాడు గిరీశం.

సరిగ్గా రెండు ఫర్లాంగుల దూరంలో రైల్వేస్టేషన్ కనిపిస్తోంది మసగ్గా. సాయంత్రం ఆరుదాటిన శీతాకాలం పొద్దు.



బయట రివ్వున వీస్తున్న చలిగాలికి మనసులో కోరికలు జివ్వున రాజుకుంటూ నులివెచ్చని కలయిక కోసం రెక్కలు చాస్తున్నాయి.

నిన్న సాయంత్రం వసుంధర పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. మరో రెండు రోజుల తర్వాత గానీ రాదు.

బయట చలి చంపేస్తోంది. పేడ పురుగుల్లా ఆలోచనలు మెదడులో సుడులు తిరుగుతుంటే గిరీశానికి అప్పుడు తట్టింది.

మొన్న అదేదో కొత్త సినిమాలో చూసినట్టు 'తప్పు చేసేద్దాం!' అని.

ఆ ఆలోచన రావడమే తడవుగా వెంటనే బస్సు దిగిపోయాడు.

ఎక్కడో తుఫాను పట్టిన సూచనగా బయట మరీ చలిగా ఉంది. తనకు తానే ఉండచుట్టుకు పోయేటంత చలి.

ఆలోచిస్తూ నిలబడ్డ అతను చూస్తుండగానే రైలు వెళ్లిపోవడం, గేటు తెరుచుకున్నాక తాను వచ్చిన బస్సు వెళ్లిపోవడం జరిగిపోయాయి.

ఈవేళ ఉదయం క్యాంపుకని పాలకొల్లు వెళ్లాడు తను. అసలు ఇక్కడ దిగే ఆలోచనే లేదు. తను వెళ్లాల్సింది పెద్ద వంతెన అవతలకి. అక్కడ కాలనీలో తన యిల్లు. టిక్కెట్టు అక్కడికే తీసుకున్నాడు తను. కాని 'చలి' యిక్కడ దిగిపోయేలా చేసింది. యిక ప్రయత్నం మొదలు పెట్టాలి అనుకుంటూ రైల్వే ట్రాక్‌ను సమాంతరంగా ఉన్న బాటలో రైల్వేస్టేషను వైపు నడవడం ప్రారంభించాడు గిరీశం.

అక్కడ రైల్వే గూడ్సు ఆగి ఉంది ఒక లైనుమీద. బొగ్గుగనుల్లో పని చేసే రాక్షస కార్మికుల్లా పట్టాలపై నిలబడి ఉన్నాయి రైలుపెట్టెలు రంగు మాసి. వాటి ప్రక్కగా క్రీనీడలో యిద్దరో, ముగ్గురో నిలబడి మాట్లాడుకుంటున్నారు.

సుమారు ఫర్లాంగు దూరం నడిచి విశాలంగా వ్యాపించి ఉన్న రావిచెట్టు మొదట్లో నిలబడ్డాడు గిరీశం.

పక్కన చీకట్లో ఎవరివో మాటలు విన్పిస్తున్నాయి.

"ఎంత?"

"వంద!"

"పాతిక చేసుకో"

"కుదర్దు"

"అసలు నన్ను ఎలుగులో సూత్తే వూరికే వత్తావు తెలుసా!"

"ఈ వూరికి కొత్తా!"

"అవును ఏం?"

"ఎలుగులో సూసినా సేసే సీకటి పనికి వందకు అయిదు పైసలు తగ్గను. రేవు నీవల్ల నాకు రోగాలంటుకుంటే నాకు డబ్బెవరిత్తారు?"

"ఛ.. ఎల్లెహ! యిప్పటికి నీకేం లేనట్టూ!"

"సాతకానోడవని సెప్పు! అచ్చమైన మగాడు మాటల్తో టైం వేస్టు సేయడు"


"అయితే సరే! ఏభై!"

"పోవెహ! ఆడంగి నా కొడకా!"

"మాటలు జాగర్తగా రానీ లం..."

"పోరా గొట్టం నా కొడకా!"

అంతలో మూడో కంఠం.




"ఎవర్నేడే లప్పా తిడతన్నావ్?"

"దొరికిందిలే ఓ సన్నాసి బేరం!"

"కుదిరిందా!"

"కొజ్జావోల్లు బేరం కుదుర్చుకుంటారేంటి? నీ పనయినాదా!"

"ఆఁ! వందిచ్చి ఒళ్లు హూనం సేసి వదిలిపెట్టాడు ఎదవసచ్చినోడు. ఈ మద్దెన ఆడగాలి సోకనట్టుంది ఎదవ నాకొడుక్కి!"

"ఓ టీ తాగొద్దామా!"

"సరే పద!"

"ఆ సెట్టు కాడెవరో నిలబడి ఉన్నాడే! బాగున్నాడు. ఉద్దోగం సేసేవోడిలా సేతిలో బేగ్ కూడా ఉంది!"

"అబ్బా! ఆడుకాకపోతే ఆడి తాతలాటి వోడొత్తాడు. ముందు టీ తాగొద్దాం పదెహ! 'అందు'కోసమే వత్తే ఏడకిపోతాడు. ఈడనే ఉంటాడు. నువురా!" ఏదో ఓ బూతు జోకు వేసుకుని ఫక్కున వికట్టాహాసంగా నవ్వుతూ దూరంగా వెళ్లిపోయాయి ఆ ఆకారాలు.

అంత చలిలోనూ చిరుచెమటలు పట్టాయి గిరీశానికి.

పెళ్లికి ముందు అనుభవం గుర్తువచ్చింది.

మొదటి రాత్రి సక్సెస్ కావాలంటే పెళ్లికి ముందు 'ఆ' అనుభవం అత్యంత ఆవశ్యకం అని ఫ్రెండ్ చెప్పి బలవంతం చేసిన మీదట, అతను తీసుకు వెళ్లినచోటుకు వెళ్లాడు తను.

అదే మొదటిసారి తను ఓ పరిచయంలేని స్త్రీతో ఒంటరిగా గదిలో ఉండటం.

ఆమె ముందే జేబులు తడిమి డబ్బులు తీసుకుని లెక్కచూసుకుని వక్షంలో ఒక వైపుకు తోసింది.

ఆమె ట్రాన్స్‌పరెంట్ జాకెట్‌లోంచి ఆ డబ్బు మడతలు గర్వంగా తొంగి చూస్తున్నాయి. ఆమె, వీణను సుతారంగా స్పృశించినట్టుగా తనను షేవ్ చేసి రంగువేసిన గోళ్లతో ముఖం మడతల దగ్గరనుంచి స్పృశించసాగింది. తన చేత్తో షర్ట్ తీసేసి రోమాంచితమైన తన శరీరాన్ని మీటలు తెలిసినట్టుగా నొక్కుతూ తనలో తమకం తాలూకు స్కేలుని క్రమేపీ పెంచుతూంటే తను ఎపుడెప్పుడు కట్టతెగిన చెలువునౌదామా అని చూస్తున్నంతలో పోలీస్ విజిల్ వినిపించడం ఈసురోమంటూ మర్రోదారిన పారిపోయి రావడమూ జరిగాయి.

కాని వసుంధర సహకారం పుణ్యమా అని మొదటిరాత్రి జీవితంలో మధురమైన రాత్రిలాగే మిగిలిపోయింది. ఆ తరువాత తనకు బయటకు వెళ్లాల్సిన అవసరం రాలేదు. ఊహు! కాదు. వసుంధర ఆ అవకాశం తనకు యివ్వలేదు.

యిన్నాళ్లకు తన చెల్లెలి తొలికాన్పుకు అదీ మొదటిసారి, యిక తప్పదు తనను వదలలేక వదిలివెళ్తూ వందల జాగ్రత్తలు చెప్పి మరీ వెళ్లింది. అందులో చెడు తిరుగుళ్లు తిరగవద్దని కూడా చెప్పింది.

ఆఁ! అయితే మాత్రం. అలవాటువడ్డ ప్రాణం వూరుకుంటుందేంటి? అయినా తనిలా వెళ్లినట్టు ఆమెకు తను చెబితేనే గదా తెలిసేది.

"బాబుగారూ! పది నిముషాలనుంచీ ఈడనే నిలబడ్డారు. ఎవరికోసమైనా ఈ సీకట్లో ఎదురు సూత్తన్నారా!" తన పక్కనే నిలబడి ఉన్న ఓ సన్నని ఆకారం అన్న మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు గిరీశం.

"వూరికేనే! ఎవరికోసమూ చూడటం లేదు. ఏం ఎందుకలా అడిగావ్?"

"నేనూ వూరికేనే అడిగినా బాబూ! సలి బాగా ఏత్తంది బాబూ!"

"అవును."

"యీ టైములో ఓ సిగిరెట్టు, ఓ మందు బాటిలు, ఓ సక్కని సిన్నది పక్కనుంటే బలేగుంటది బాబూ!"

గిరీశం చిన్నగా నవ్వాడు.

"నువ్వు చూస్తే యీ చలిగాలికి ముడుచుకుపోయే మూడంకెలా ఉన్నావ్! యీ వయసులో నీకీ కోరికేంటి?"

"నేనన్నది నా గురించి కాదు బాబు! మీ గురించి!"

ఉలిక్కిపడ్డాడు గిరీశం.

"ఏం ఏదన్నా మంచి బేరం ఉందా!" అటూ యిటూ పరికించి చిన్నగా అడిగాడు.

"ఉంది కాబట్నే మిమ్మల్ని అడిగాను. అయితే వత్తారా!"

"ఎంత?"

"ఆడకెల్లాక ఆయమ్మ సెప్పుద్దిలెండి!"

"అబ్బ! చెత్త సరుకు నాకొద్దు. నాణ్యమైనది కావాలి!" చిరాకువడ్డాడు గిరీశం.

"అట్టాగే బాబూ! పక్కా ఫామిలీ లైవు. ఆ యమ్మ మొగుడు సుగరు ఫ్యాక్టరీలో పనిసేసేవోడు. తాగుమోతునాయాలు. తాగుడెక్కువై సచ్చిపోయాడు. ఆయమ్మ సిన్నా సితకా పనిసేత్తది. మరీ డబ్బు యిబ్బంది వచ్చినప్పుడు మాత్తరవే యిలా!"

"అలాగా! అయితే ఎంతివ్వచ్చు అంటావ్?"

"మీరేమనుకోకపోతే అయిదు వందలు ఆయమ్మకి. నచ్చితే వచ్చాక నాకు తమకు తోసింది యిద్దురుగాని!" అన్నాడతను.

"అలాగే! ఎక్కడ?" అడిగాడు గిరీశం.

"నాతో రండి!" అనబోయిన ఆ రిక్షావాడు "ఉండండి! నేనే రిక్షా తీసుకొత్తా!" అంటూ

పుష్పక విమానంలా అలంకరించి ఉన్న ఓ రిక్షాతో వచ్చాడు. కొత్త రిక్షా కాబోలు.

దానికి మూడు వక్కలా పరదాలున్నాయి.

"ఎక్కండి బాబూ! ఆ యింటికి ఎళ్దాం!"

అటూ యిటూ చూసి ఒక్కసారిగా గిరీశం రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా కదిలింది.

***

అయిదు నిముషాల అనంతరం ఒకే ఒక గేటు కలిగి విశాలమైన ప్రాంగణంలో కుదుమట్టంగా అందమైన తోటలో ముత్తయిదువులా నిలబడిన 'పెంకుటింటి' ముందు రిక్షా ఆగింది. తోటలోని పూల పరిమళంతో ఆ వాతావరణమంతా ఆహ్లాదంగా ఉంది.

రిక్షా అతను గేటుతీసి లోపలికి వెళ్లాడు. తలుపుమీద కొట్టాడు సన్నాగా.

తలుపు తెరుచుకుంది. 'కలువ బాల' లాంటి స్త్రీ మూర్తి లైటు వెలుగులో తళుక్కున తారకలా మెరిసింది. అతనితో మాట్లాడింది. తలుపు పట్టుకుని 'అభిసారిక'లా అలాగే నిలబడింది.

రిక్షా అతను వచ్చి పరదా తొలగించబోయాడు.

"ముందు ఏమందో చెప్పు!"

"పండే బాబుగారు! దిగండి!"

"అటూ యిటూ చూడు! ఎవరూ లేరుగా!"

"లేరు బాబు!"

గిరీశం పిల్లిలా చప్పుడు చేయకుండా దూకి వడివడిగా లోపలకు వెళ్లిపోయాడు. ఆమె రిక్షా అతన్ని వెయిట్ చేయ్యమన్నట్టుగా సైగచేసి తలుపు వేసేసింది. లైటు తీసేసింది.

***

సుమారు గంట తరువాత

లైటు వెలిగింది. తలుపు తెరుచుకుంది.

దాన్ని చూస్తూనే ఎలర్ట్ అయ్యాడు రిక్షావాడు. ఎవరూ లేరని సైగ చేశాడు. గిరీశం గబగబా వచ్చి రిక్షాలో కూర్చున్నాడు.

పరదాలు సరిచేసి రిక్షావాడు లోపలికెళ్లాడు.

"అమ్మా! ఎంతిచ్చాడు?"

నువ్వు చెప్పినంతా యిచ్చాడు. అయితే నన్ను ముట్టుకోలేదు."

"అదేంటమ్మా! మీరు సెప్పేది నిజమేనా?"

"నిజమే నాంచారయ్యా! నేను ముందుగానే డబ్బు తీసేసుకున్నాను. లైటు తీసేశాను. తనకు లైటు అవసరమట. సరేనన్నాను. విప్పడానికి రెడీ అవుతుంటే అతను వద్దన్నాడు. నన్ను అనుభవించాలని అనిపించలేదుట. ఆడదాన్ని చూస్తూనే కసిరేగే కోరిక పుట్టాలట. అలాంటి ఆడదానికి కావలసినన్ని బేరాలొస్తాయి. కానీ కలువమొగ్గలా ఉన్న నిన్ను యీ రకంగా వూహించలేకపోతున్నాను అని బాధపడ్డాడు."





## చెల్లెలి కోసం

ఇదేదో పాత తెలుగు సినిమా పేరు కాదు. సుప్రసిద్ధ సితారువాదకులు పండిత రవిశంకర్ కుమార్తెలు అనుష్క, నోరాజోన్స్ తమ మధ్య వున్న సత్సంబంధాలను మరింత సుదృఢం చేసుకునేందుకు వీపుల మీద పచ్చబొట్లు పొడిపించుకున్నారు. అనుష్కకు పాపం, చాలా బాధ కలిగిందట కానీ చెల్లెలు నోర కోసం నవ్వుతూ పళ్ల బిగువున అంతా భరించిందట.

"మరింతసేపూ ఏం చేశాడు?"

"నా అందాన్ని తనివితీరా చూస్తూ ఎన్నో అడిగాడు. నిర్భయంగా జవాబు చెప్పాను. డబ్బు వద్దన్నాను. తను సంతోషంగా యిచ్చేది కాబట్టి తీసుకుతీరాలన్నాడు. సరేనన్నాను."

"పిచ్చోడు!" అన్నాడు నవ్వుతూ నాంచారయ్య!

"లేదు నాంచారయ్యా! అతను అమాయకుడైన మంచోడు- మళ్లీ యిదేరోజు- యిదే టైముకి- కలుద్దాం" అందామె.

"అలాగేనమ్మా! వెళ్లొత్తాను."

నాంచారయ్య బయటకు వచ్చాడు. రిక్షాలో బస్టాండు వైపు కదిలాడు.

***

"బాబుగారూ! ఎంతవరకు తమరెల్లాలి?" రిక్షా తొక్కుతూ దారిలో అడిగాడు నాంచారయ్య.

"పెద్ద వంతెన డౌన్‌లో శ్రీరామ్‌నగర్ కాలనీ!"

"అయితే మీదీ వూరేనా బాబూ!"

"అవును ఏం?"

"అమ్మగారూళ్లో లేరేటి?"

"నీకెలా తెలుసు?"

"నేను మిమ్మల్నా సెట్టుకాడ మొదటిసారిగా సూసాను. గత రెండేళ్లనుంచి పగలు బేరాలన్నీ సూసుకుని, రాతిరేల యిట్టాంటి బేరాలు సూత్తుంటాను."

"ఏం ఎందుకల్లా?"

"యిట్టాంటి బేరాలకు పైసలెక్కువొస్తయి! అందుకని!"

"అసలు నెలకు ఎంత సంపాదిస్తావేమిటి?"

"సుమారు రోజుకు రెండొందలు సంపాదిత్తానబ్బాయి గారూ."

"ఎంతకాలంనుంచి రిక్షా తొక్కుతున్నావ్?"

"సుమారు యిరవై ఏళ్లనుంచి".

"అంటే నీ వయస్సు?"

"నాకు నలభై అయిదు సంవత్సరాలు దాటినై బాబూ! అయిదో తరగతి సదూకుంటూ మానేసినా! మా అయ్య అటాత్తుగా పోడంతో నేను రిచ్చా పట్టుకోవాల్సొచ్చింది."

"మరింత కాలంనుంచి కష్టపడుతున్నావు కదా! ఏ మాత్రం వెనకేశావేమిటి?"

"ఏమీ వెనకెయ్యలేదు బాబూ! నాకు పెళ్లాం; యిద్దరు బిడ్డలు. పెద్దది అమ్మాయి. సిన్నోడు అబ్బాయి. అమ్మాయికి పెళ్లిసేసినా! అబ్బాయి డిగ్రీ సదూతున్నాడు. పొద్దుటేల; సాయంకాలం ట్యూషన్లు సెప్పుకుంటూ ఓ వెయ్యి రూపాయలు

సంపాదిత్తన్నాడు."

"మరి అంత డబ్బు వస్తూంటే సుఖంగా దర్జాగా బ్రతక్క యిలా రిక్షా తొక్కాల్సిన అవసరం ఏముంది?" అడిగాడు గిరీశం.

"బాబూగారు! మా పెళ్లయ్యేనాటికి మా యావిడకు పన్నెండేళ్లు. నాకు పదిహేడేళ్లు. సంవత్సరం తేడాతో బిడ్డలు పుట్టేశారు. యిపుడు అమ్మగారు యింటికాడ లేనప్పుడు మీరు యాడకొచ్చినట్టుగానే, మా ఆడది పురిటికెళ్లినప్పుడు నేనూ యిట్టాంటి పనే సేసినా! ఆ యిసయం మా యావిడకి తెల్సిపోయింది. "పెళ్లాం వూరెళ్లితే మీ మగోళ్లకే పురుగు దొలుత్తాదా? అక్కడ వూరెళ్లిన ఆడదానికి పురుగు దొల్వదా! అయినా ఏ ఆడదానికైనా మొగుడ్నిసెపెట్టి ఎళ్లాలని సరదానా! నీ బిడ్డకు జన్మ యివ్వాలనేగదా పుట్టింటికెల్తాంట. ఆ పురుడేదో యిక్కడ పోసుకుంటే మొగుడు పడే బాధ సూడలేక; తాను పనిచేసే అవకాశం లేక ఆడది ఏడవకుండా, పుట్టింటికి పురిటికెళ్తాది. అంతేగాని మీకు యిలాంటి తప్పు పనిసేసే అవకాశం యివ్వడం కోసం కాదు. అయినా నువ్వు ఎవత్తికాడకో ఎళ్లావంటే నిన్ను నేను సుఖపెట్టలేకపోయానన్న మాట నీలాగ నేను కూడా యీడ తప్పుసేత్తే నన్నేలుకుంటావా! యింక నీకు నాకు సెల్లు. ఎల్లిపో" అని తిట్టి తిట్టి పడిపోనాది. అప్పుడర్థమైంది బాబూ! నేనెంత తప్పు సేసినానో!"

"అప్పటినుంచి నా భార్యాపిల్లలు సుఖ సంతోషాలలో బతకాలి అందుకు నేను కట్టపడి సంపాదించాలి. మనిషికి కావలసినవి కడుపునిండా తిండి- కట్టుకోడానికి బట్ట- ఉన్నంతలో మంచిగూడు. మా ఆడదానికి మాంసం కూర సానా యిట్టం. రోజు నీసు కావాలంటది. ఉన్నంతలో మంచి చీరలు కడతాది. నాకు మంచి బట్టలు కుట్టిస్తది. పిల్లలకు ఏం కావాలన్నా అడిగిందే తడవుగా కొనిపెడతది. అయితే అన్నీ మాకు అందుబాటులోయే కొంటది. వారానికోపాలు సినిమాకెల్తాం. యిట్టాంటి పాడు ఆలోసెనలు రాకుండా ఉండటం కోసం ఏదోపని కల్పించుకుంటా ఉంటాను. బాబూ! అదీ యిసయం."

గిరీశం మౌనంగా ఉండిపోయాడు.

రిక్షా తను చెప్పిన అడ్రసు ప్రకారం తన యింటి ముందు నాంచారయ్య ఆపాక దిగి రెండువందలు నాంచారయ్య చేతిలో ఉంచాడు గిరీశం.

"బాబుగారు! ఏంటది? యింత డబ్బా! వద్దండి." అన్నాడు తిరిగి గిరీశం చేతిలో పెట్టేస్తూ.

"చూడు! ఒక బోయవాడు వాల్మీకి ఎలా అయ్యాడో నాకు నిన్ను చూస్తే అర్థం అవుతోంది. నువ్వు జీవితాన్ని మధించి జీవనసారం గ్రహించినవాడివి. అది గ్రహించని నాలాంటి వాళ్లను మార్చడంకోసం కాబోలు భగవంతుడు నీలాంటి వాళ్లరూపంలో దర్శనమిస్తుంటాడు. ఆ అమ్మాయిని చూస్తుంటే నేను ఎంత తప్పు చెయ్యడానికి సాహసించానో నాకు అర్థం అయింది. ఆ అమ్మాయి వల్ల అర్థనిమిలితుడనైన నేను నీవల్ల పూర్తి కళ్లు తెరిచాను. ఉంచుకో! ఎప్పుడైనా వస్తూండు!" అంటూ అతని సమాధానంకోసం ఎదురుచూడకుండా లోపలకు నడిచాడు గిరీశం.

***

ఆరోజు ఉదయం వసుంధర వూరునించి వచ్చేసిన వేళ-

వరండా పడక కుర్చీలో పేపరు చదువుకుంటున్న గిరీశంతో వంటింట్లోంచే అరిచింది వసుంధర.

"ఏమండోయ్! వీధిలోకి కూరల బండి వచ్చినట్టుంది. రెండు కూరలు తీసుకోండి."

పేపరు పక్కన పడేసి టవలు భుజంచుట్టూ కప్పుకుని గేటుతెరిచి రోడ్డుమీదకు వచ్చాడు గిరీశం.

"బాబూ! కూరలూ! యిటురా!"

దగ్గరగా వస్తున్న కొద్దీ ఆ ఆకారాన్ని చూసి ఆశ్చర్యపోయాడు.

అతను నాంచారయ్య.

"యిదేమిటి? నువ్వు కూరగాయలు కూడా అమ్ముతావా?"

నాంచారయ్య నవ్వాడు.

"చెప్పాను కదా బాబూ. ఖాళీగా ఉంటే తలలో పురుగులు తొలుత్తాయని. నాకు ఎన్ని రకాలుగా సంపాదించడం వచ్చో అన్నిరకాలుగా సంపాదిత్తా. పగలు పదింటికల్లా బేరాలు తగ్గుతాయి బాబూ! అప్పట్నుంచి నాలుగింటివరకూ యీపని సేత్తా! నాలుగింటినుంచి మళ్లీ రిక్షా బేరాలు సూసుకుంటా! రేపట్నుంచి నేను యింకో కాలనీకెళ్తా. అమ్మాయికి యీ కాలనీ అయితే దగ్గరగా ఉంటుందని అలవాటు సేత్తున్నా!" అన్నాడు నాంచారయ్య వెనుదిరిగి ఎవరి రాకకోసమో చూస్తూ.

"అమ్మాయి ఎవరు?" గిరీశం మాట పూర్తి కాకుండానే ఆ 'కలువబాల' బండికి దగ్గరగా వచ్చింది. గిరీశాన్ని చూస్తూనే చేతులెత్తి నమస్కరించింది.

"యిదిగో అయ్యా డబ్బులు!" అంటూ నాంచారయ్యకిచ్చింది.

గిరీశం ఆశ్చర్యంనుంచి తేరుకునేలోగా నాంచారయ్య అన్నాడు.

"బాబుగారు. ఏ మడుసులు ఎప్పుడు ఎక్కడ ఎట్టా కలుత్తారో సెప్పలేం. ఆడది డబ్బు సంపాదించాలంటే తాను సెడిపోయి, ఆరోగ్గెం సెడగొట్టుకుని, మరో పదిమంది ఆరోగ్గెలు సెడకొట్టడం కన్నా పదిమంది ఆరోగ్యాలు బాగుండేలా సేసే కాయగూరలు అమ్ముకుంటానని అమ్మాయి నాతో అంది బాబు. తన కాడకు వచ్చి పశువుల్లా ప్రవర్తించిన వాళ్లకన్నా కామధేనువులా మంచిమార్గం సూపించిన మీ మంచితనానికి అమ్మాయి మడిసి అయ్యింది బాబు. యిదంతా మీ పున్నెమే బాబూ!"

"లేదయ్యా! యిందులో నీ పాత్ర కూడా ఉంది. నీరే అయినా శంఖంలో పోస్తేనే తీర్థమౌతుంది. నువు శంఖానివి. నేను ఆ తీర్థాన్ని. ఆమె ఆ శంఖు తీర్థం తాగింది అంతే!" అన్నాడు గిరీశం తలవంచుకున్న ఆమెను మెరిసే కళ్లతో చూస్తూ.

"అబ్బబ్బ! రెండు కూరలు తీసుకోమంటే ఎక్కడికక్కడ బంకమన్నులా అతుక్కుపోతారు కదా! ఎంతసేపు! నేను కత్తిపీటముందు కూర్చుని అరగంట అయింది." వసుంధర అరుపులు హాల్లోంచి వినబడటంతో నాంచారయ్య వెళ్లటానికి ఉద్యుక్తుడవుతూ అన్నాడు-

"రోజూ కూరలు తనకాడే తీసుకోండి బాబు. వత్తాం బాబూ!"

ఆమె మౌన శిఖరంలా గిరీశానికి నమస్కరించి ముందుకు నడుస్తూంటే కూరలతో లోపలకు అడుగుపెడుతున్న అతనికి అత్యంత యిష్టమైన పాట యాదృచ్ఛికంగా టీవీలో కాబోలు- వస్తోంది.

"నిన్నటి దాకా శిలనైనా
నీ పదము సోకి నే గౌతమినైనా..." ■

## మరీ అంత డ్యూటీ మైండెడా?

రుమానియాలో మెడాలిన్ అయొనెట్ స్టైన్ అనే పోలీసు పెళ్లిలో కేక్ కట్ చేయటానికి తన నూతనవధువుతో సహా వెళుతుండగా, దారిలో ఆగిన కార్ల దగ్గర అనుమానాస్పదపరిస్థితుల్లో ఓ వ్యక్తి తచ్చాడటం చూశాడు. అంతే వధువును వదిలేసి, అతని వెంట పడ్డాడు. రెండు గంటల పాటు బండి మీదా, మరి కాసేపు పరుగులెత్తి, ఎలాగైతేనేం, అతన్ని బంధించాడు. కానీ పెళ్లి కోసం వేసుకున్న తెల్లని సూటంతా మట్టి కొట్టుకుపోయింది. కానీ పాపం, తిరిగొచ్చాక వధువు ప్రశంసలకు బదులుగా తిట్ల వర్షం కురిపించిందిట. తిట్టదూ మరి?